ఇట్లాంటి కేసుల్లో తప్పనిసరిగా పరీక్ష చేసి తీరాలి."

"అయితే రేపే తీసుకొస్తాను సార్."

"బైదిబై, యింతకి యెవరన్నావ్ ఆ అమ్మాయ్?"

"నా క్లాస్‌మేట్ సార్! మిస్ సుజాత.... అంటే స్వయానా మీ...."

గుడ్లు తేలేసి కుర్చీలో ఓ వక్కకి ఒరిగిపోతున్న డాక్టర్ను చూసి, "నర్స్....నర్స్...." అని కేకలు వేశాడు విజయ్. □

కళాశాల విద్యార్థుల కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# అందం

పోతిన భవానీశంకర్ బి. ఎస్‌సి. (తృతీయ) విక్రమ్‌దేవ్ కాలేజి, జైపూర్

"హాయ్ స్మాల్‌పాక్స్ బ్యూటీ" అని నేను కామెంట్ చేయటంతో చప్పట్లు మారుమోగాయి. ఫ్రెండ్స్ అందరూ నన్ను ఆకాశానికి ఎత్తేశారు. పెద్ద ఘనకార్యం సాధించిన హీరోలా ఫీలయ్యాను. ఎదురుగా వస్తున్న నీరజ తల దించుకొని వెళ్ళిపోయింది.

నీరజ నిజానికి యెంతో అందంగా ఉంటుంది. ఆ ముఖంపైన మశూచికం మచ్చలు లేకపోయి వుంటే ఆమె అందం నిరుపమానం. స్నేహితుల ప్రోత్సాహంతో అలా కామెంట్ చేశానే కాని తర్వాత బాధపడ్డమాట నిజం. అలా యెందుకు కామెంట్ చేశానా అనిపించింది.

క్లాసు అయిపోయిన తర్వాత నీరజ వెనుక నుండి పిలుస్తుంటే గబ గబా వచ్చేద్దామనుకొన్నా సాధ్యంకాలేదు. ఇంతలో నీరజ వచ్చి "కంగ్రాచ్యులేషన్స్ గోపీ, గొప్ప పనే చేశావు. ఒక చిన్న సలహా, ఒకరి గురించి కామెంట్ చేసేముందు ముందుచూపు వుండడం మంచిది. మనం చేసే కామెంట్‌ని ఎదుటి వ్యక్తి సంతోషంగా తీసుకొంటేనే అందం. థాంక్యూ" అని చరచర తిరిగిచూడకుండా వెళ్ళిపోయింది.

* * *

పరీక్షలు అవుతూ ఉన్నాయి. ఈ ప్రాక్టికల్స్‌తో పరీక్షలయిపోయినట్టే. ఏమిటో కెమిస్ట్రీ అంటేనే గాభరా. ఇంకా పది నిముషాలు మాత్రమే ఉంది. ఈలోపల సాల్టు ఎనాలిసిస్ చేసితీరాలి. ఎందుకో టెస్టుట్యూబ్ లోని యాసిడ్ యింకా బాయిల్ అవడంలేదు. మంట (ఫ్లేమ్) పెంచాను. అంతలో యేదో పేలిన శబ్దం, ముఖంపై ఏదో చిలకరింపు. కళ్ళు మంటలు. అంతే....మర్నాడు చూస్తే నా ముఖం అంతా కమిలిపోయినట్లు అక్కడక్కడా మడతలు. మడతలూ, మచ్చలూ! అబ్బా! చిన్నపిల్లలు చూస్తే దడుచుకొనేలా ఉన్నది నాముఖం. ఒకనాటికాలేజీ హీరోముఖం.

* * *

కాలేజికి బయల్దేరాను. గేటువద్ద నీరజ తన స్నేహితురాండ్రు గుమికూడి ఉన్నారు. సరాసరి వారి దగ్గరకు వచ్చాను. అంతే - పక పక నవ్వులు, చప్పట్లు. నీరజ కామెంట్. "హాయ్,ఫోల్డుఫేస్ హాండ్‌సమ్"...."త్రీఛీర్స్ ఫర్ అవర్ ఫోల్డు ఫేస్డ్ ప్రిన్స్...హిపిప్‌రే...."

హిపిప్....రే

హిపిప్....రే

నాలో సహనం నశించింది. ఒక్కసారిగా అరిచాను.

"స్టాపిట్....ఐసే....స్టాపిట్"

చప్పట్లు, పకపకలు అంతా బంద్....

కళ్ళు తెరిచాను—చుట్టూ చీకటి. నేను మంచంమీద....

"ఏమయింది?" అంటూ డాడీ, మమ్మీ వచ్చారు....అంటే ఇది కలా లేక నిజమా.... వెంటనే అద్దంలో చూసుకొన్నాను. ఏమీ కాలేదు. "థాంక్ గాడ్!"

మర్నాడు నీరజను క్షమించమన్నాను. అందుకు నీరజ ఇలా అన్నది. "పరవాలేదు గోపీ,యిప్పటికయినా తప్పు తెలుసుకున్నావు."

అప్పు డనుకొన్నాను నీరజకన్నా నీరజ మనసే అందమైందని. □

# పచ్చదనం

ఆదూరి వెంకట సీతారామమూర్తి

ఆదినారాయణరావుకి అర్జంటుగా పదిరోజులు సెలవు కావల్సి వచ్చింది. ఆఫీసరు ఆనందరావు చూడబోతే అఖండుడూ—అసాధ్యుడూను. చచ్చి గీపెట్టినా అరపూట లీవు కూడ ఇచ్చేట్టు లేడు. కంపెనీ కుర్ర డాక్టరు కూడా కొరకరాని కొయ్యే—ఒకంతట నిక్కరాయడు.

'ఏం చేయాలి?' అని రెండ్రోజులు సీరియల్‌గా బుర్ర గోక్కుని, సీరియస్‌గా ఆలోచించగా... చించగా ఓ అద్భుతమైన ఐడియా తట్టింది ఆనందరావుకి.

'వాళ్ళకిదే మందూ—తనకిదే మార్గమూను' అనుకున్నాడు.

సరాసరి కంపెనీ కుర్ర డాక్టరు దగ్గరకెళ్ళి తనకు పచ్చకామెర్లన్నట్టు అనుమానంగా ఉందన్నాడు. పొట్టలో ఎడంవైపు నొప్పిగా వుంటూందనీ....యూరిన్ కలరూ గట్రా అన్నీ చెప్పాడు. అంతా విని; కళ్ళను తనకున్న జ్ఞానంతో పరీక్ష చేసి,

'నోనో—యూ ఆర్ ఆల్‌రైట్' అన్నాడాయన.

కుర్ర డాక్టరుమీద విపరీతమైన కోపమొచ్చింది ఆదినారాయణరావుకి. కానీ అది కన్పించనీయకుండా తనకు లేని ఓ బామ్మగార్ని సృష్టించి, ఆవిడగారు కామెర్ల స్పెషలిస్టనీ ఆవిడే యీ అనుమానాన్ని లేవదీసిందనీ కథ అల్లేడు. ఇలా కామెర్లను కానుకోలేకే మరో పాతికేళ్ళు బతకాల్సిన తన మామగారు అకస్మాత్తుగా హరీమన్నాడనీ చెప్పేడు.

అంతా విని కుర్ర డాక్టరు ఆలోచనల్లో పడ్డాడు.

"మన కంపెనీలో సరియైన ఇన్‌స్ట్రుమెంట్స్ లేవు. ఏం చేయమంటారో మీరే చెప్పండి" అని ఆదినారాయణరావునే అడిగి, అతని సలహాపైనే 'యూరిన్ టెస్టు' కోసం ప్రైవేట్ క్లినిక్‌కి రిఫర్ చేశాడు. రొట్టె విరిగింది. ఇక నేతిలో పడ్డమే తరువాయి అనుకున్న ఆ.నా.రావు ఒకానొక ప్రైవేట్ క్లినిక్‌లో తనకు తెల్సినాయనచేత తన జబ్బు 'పచ్చకామెర్లే' అని ఋజువు చేయించుకుని, పదిహేనురోజుల సిక్ లీవు సంపాదించి హాయిగా స్వంతూరు వెళ్ళి పనులు చూసుకొని పదహారో రోజు ఆఫీసులో జాయినయ్యేడు.

ఆ సాయంత్రం యింటి కొస్తూంటే కడుపులో ఎడంవైపు చిన్ననొప్పి వచ్చింది ఆ.నా.రావుకి. ఇంటి కెళ్ళి యూరిన్ చూశాడు. సందేహంలేదు. కాఫీ అందిస్తూ-"మీ కళ్ళేమిటలా పచ్చగా వున్నాయ్?" అంది అతని భార్య. ఆదినారాయణరావు కళ్ళు నిజంగానే పచ్చబారేయి! □